


ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 52 తిరుపతి తేది :శనివారం 23 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS



## సైప్రస్ అధ్యక్షునితో మోడీ ద్వైపాక్షిక సమావేశం

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 22

ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షులు నికోస్ క్రిస్టోడౌలిడెస్ తో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత ముందుకు తీసుకువెళ్తుందని, అనేక రంగాల్లో ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత - మిగతా 2లో..

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎండల తీవ్రతపై అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- తక్షణ సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాలి
- స్థానిక పరిస్థితుల మేరకు చర్యలు ప్రకటించాలి



అమరావతి - ఆంధ్రనాడు, మే 22

రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. భారీ ఉష్ణోగ్రతలు, వడ గాడ్పుల నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతలపై ముఖ్యమంత్రి శుక్రవారం నాడు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండల నుండి ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని సూచించారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించా లన్నారు. ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో - మిగతా 2లో..

# రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

- రాయలసీమలో 600 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి నారా లోకేష్
- సోషల్ మీడియా వేదికగా స్పందించిన సీఎం చంద్రబాబు
- రూ.3000 కోట్ల పెట్టుబడితో 11 నెలల్లోనే నిర్మాణం పూర్తి
- పరిశుభ్ర ఇంధన రంగంలో ఏపీ ముందు వరుసలో ఉందని వెల్లడి
- రికార్డు సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ బృందానికి అభినందనలు

కడప - ఆంధ్రనాడు, మే 22

కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (సాయీల్) 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఏపీ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రికార్డు సమయంలో ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. "వ్యాపార నిర్వహణ వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), కార్యనిర్వహణ వేగం



(స్పీడ్ ఆఫ్ ఎగ్జిక్యూషన్) రెండూ కలిసిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని చెప్పడానికి నేను గర్వపడుతున్నాను. ఈ రోజు, రాయలసీమలో ఎస్ఏఈఎల్ సంస్థ నిర్మించిన 600 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును మన ప్రజలకు అంకితం చేశాం. రూ.3,000 కోట్ల పెట్టుబడితో కేవలం - మిగతా 2లో..

## జగన్ ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' గుర్తుకొస్తున్నాడు

- తమ కుటుంబంలో జరిగిన మరణాలన్నీ చంద్రబాబు హయాంలోనే జరిగాయన్న అచ్చెన్నాయుడు
- వైఎస్ మరణం వెనుక రిలయన్స్ ఉందని చెప్పినవారు ఇప్పుడు చంద్రబాబుపై పడుతున్నారని మండిపాటు
- అధికారంలో ఉన్న కాలంలో వివేకా హంతకులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్న

అమరావతి-ఆంధ్రనాడు, మే 22



వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు తనదైన శైలిలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్ కుటుంబంలో జరిగిన మరణాలన్నీ టీడీపీ, చంద్రబాబు హయాంలోనే జరిగాయంటూ జగన్ చేసిన ఆరోపణలను కొట్టి పారేసిన ఆయన.. జగన్ ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' సినిమా పాత్ర గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. జగన్ తాత రాజారెడ్డిని ఎందుకు హత్య చేశారో, ఆనాటి వైఎస్ కుటుంబ అరాచకాలను బాధితుడు పార్థసారథిరెడ్డి స్వయంగా వివరించారని అచ్చెన్న గుర్తుచేశారు. రాజారెడ్డి హత్య కేసులో ఉన్న - మిగతా 2లో..



## విద్యా, ఆర్థిక సాధికారతలతో సామాజిక స్థాయి మెరుగు - సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, మే 22

విద్యా, ఆర్థిక సాధికారతలతో సామాజిక స్థాయి పెరుగుతుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యా నించింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల్లోని పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలు ఇంకా కొనసాగు తుండడాన్ని సుప్రీం కోర్టు శుక్రవారం ప్రశ్నించింది. తల్లిదండ్రు లిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు లైనందున పిటిషనర్‌ను రిజర్వేషన్ నుంచి మినహాయించడాన్ని సమర్థిస్తూ కర్నా టక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.వి.నాగరత్న, - మిగతా 2లో..

# పీఎన్‌జీ విస్తరణకు చర్యలు వేగవంతం

- యువతకు శిక్షణ
- మహిళా సంఘాలతో ప్రచారం
- ఆలయాల్లో తప్పనిసరి వినియోగం
- మంత్రి నాదెండ్ల మనోహర్




అమరావతి -ఆంధ్రనాడు, మే 22

రాష్ట్రంలో పైపులైన్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) విస్తరణను వేగవంతం చేయాలని, ఎల్‌పిజికి ప్రత్యామ్నాయంగా పిఎన్‌జి వినియోగాన్ని పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. పిఎన్‌జి గ్యాస్ కంపెనీల ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్థన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. ప్రజలకు వంటగ్యాస్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నగరాలు, పట్టణాల్లో పిఎన్‌జి విస్తరణకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తున్నామని, సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. పిఎన్‌జి ఫిల్లింగ్ సెంటర్ల కోసం అవసరమైన స్థలాలను లీజు విధానంలో కేటాయించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. పిఎన్‌జి రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత తలెత్తకుండా - మిగతా 2లో..

## పాస్టర్ అభినయ్ దర్శన్ వెనుక రాజకీయ కుట్ర

- కడప జిల్లాకు చెందిన అభినయ్‌కు అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందన్న హోం మంత్రి అనిత
- గిరిజనులను నమ్మించి పాస్టర్ అవతారమెత్తారని వ్యాఖ్య
- తనపై దాడి జరిగినట్టుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారన్న అనిత

అమరావతి -ఆంధ్రనాడు, మే 22



క్రైస్తవ మత ప్రచారకుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. అభినయ్ దర్శన్ వ్యవహారం వెనుక పెద్ద రాజకీయ కుట్ర కోణం దాగి ఉందనే అనుమానాన్ని వ్యక్తం చేస్తూ, దీనిపై పోలీసులు ఇప్పటికే లోతైన విచారణ జరుపుతున్నారని ఆమె వెల్లడించారు. రాజకీయ కుట్ర కోణం - మిగతా 2లో..

# సైప్రస్ అధ్యక్షునితో మోడీ ద్వైపాక్షిక సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

బలోపేతం చేయడంలో ఉన్న ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే ఏడాదికి భారత్-సైప్రస్ దౌత్య సంబంధాలు 65 ఏళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో, ఇరు దేశాల ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత దూకుడుగా మారడానికి ఈ సమావేశం కీలకమైన ముందడుగు అని విదేశాంగ శాఖ తెలిపింది. ఉమ్మడి విలువలు, బలమైన ప్రజల మధ్య సంబంధాలతో కాలపరీక్షకు నిలిచిన సన్నిహిత సంబంధాలను భారత్- సైప్రస్ పంచుకుంటున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది అలాగే, భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి ఈ ద్వైపాక్షిక సమావేశం దోహదపడుతుందని పేర్కొంది. సైప్రస్ ప్రస్తుతం యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్ష పదవిని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నాలుగు రోజుల భారత పర్యటన కోసం ఈ నెల 20న సైప్రస్ అధ్యక్షులు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ముందుగా ముంబయికి చేరుకున్నారు. ముంబయి విమానాశ్రయంలో మహారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముంబయిలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఒక వ్యాపార వేదికలో ఆయన పాల్గొన్నారు. ముంబయి నుంచి గురువారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం మోడీతో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో సైప్రస్ అధ్యక్షుడితో పాటు ఆ దేశ విదేశాంగ మంత్రి కాన్‌స్టాంటినోస్ కొంబోస్, రవాణా మంత్రి అలెక్సిస్ వాఫియాడెస్, సీనియర్ అధికారులు, వ్యాపార నాయకులతో కూడిన ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కూడా ఉంది.

# రాయలసీమలో మెగా సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

11 నెలల రికార్డు సమయంలో ఈ చరిత్రాత్మక ప్రాజెక్టును పూర్తి చేయడం జరిగింది. సుస్థిర భవిష్యత్తు పట్ల మాకున్న తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనం. భారతదేశ స్వచ్ఛ ఇంధన ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెడుతున్న ఇలాంటి ప్రాజెక్టులు మాకు ఎంతో గర్వకారణం. ఈ ప్రాజెక్టును ఇంత తక్కువ సమయంలో పూర్తి చేసిన ఎస్ఏఈఎల్ ఇండియా బృందానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ప్రాజెక్టు ద్వారా మన ప్రజలకు ఉద్యోగాలు, అభివృద్ధి, కొత్త అవకాశాల రూపంలో గణనీయమైన ప్రయోజనాలు చేకూరుస్తాయని నేను మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# జగన్ ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' గుర్తుకొస్తున్నాడు

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తి ఇవాళ వైసీపీలోనే కొనసాగుతుండటం జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. ఇక అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడిన రెండు రోజులకే వైఎస్సార్ హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారంటూ జగన్ చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. ఆనాడు తిరుమల వేంకటేశ్వర స్వామికి కీడు తలపెడితే మంచి జరగదని మాత్రమే చంద్రబాబు అన్నారని, గతంలో వైఎస్సార్ మరణం వెనుక 'రిలయన్స్' ఉందన్న వారే ఇప్పుడు చంద్రబాబుపై పడుతున్నారని ధ్వజమెత్తారు. అలాగే బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి మరణాన్ని మొదట గుండెపోటు అని నమ్మించి, ఆపై గొడ్డలితో నరికి చంపిన చరిత్ర వారిదేనని.. అందుకే వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని పిలుస్తున్నామని స్పష్టం చేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా వివేకా హంతకులను ఎందుకు పట్టుకోలేకపోయారో జగన్ సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు నిలదీశారు.

## విద్యా, ఆర్థిక సాధికారతలతో

# సామాజిక స్థాయి మెరుగు

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ విచారణ జరిపింది. "తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులు, అటువంటపుడు వారికి ఎందుకు రిజర్వేషన్లు కల్పించాలి? విద్యా, ఆర్థిక సాధికారతలతో సామాజిక స్థాయి పెరుగుతుంది. అటువంటపుడు, మళ్ళీ వారి పిల్లలకు ఎందుకు రిజర్వేషన్లు కావాలని కోరుతున్నారు. ఇలా అయితే ఈ రిజర్వేషన్ వ్యవస్థ నుండి మనం ఎప్పటికీ బయటకు రాలేం" అని బెంచ్ వ్యాఖ్యానించింది. విద్యార్థుల తల్లిదండ్రులు మంచి ఉద్యోగాల్లో వుండి, ఆకర్షణీయమైన వేతనాలు పొందుతుంటే, అటువంటి సంపన్న వర్గాలను రిజర్వేషన్ ప్రయోజనాల పరిధి నుండి బయటకు తీసుకురావాలని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ విషయంలో అటువంటి సంపన్న వర్గాలకు రిజర్వేషన్లు మినహాయిస్తూ ప్రభుత్వం ఇప్పటికే అనేక ఉత్తర్వులు జారీ చేసిందని బెంచ్ పేర్కొంది. కానీ వాటిని ఇప్పుడు సవాలు చేస్తున్నారని పేర్కొంది. "ఆర్థికంగా బలహీన వర్గాలకు, వెనుకబడిన గ్రూపులకు సామాజిక వెనుకబాటుతనం అంటూ ఏమీ వుండదు, కేవలం ఆర్థిక వెనుకబాటుతనం మాత్రమే వుంటుంది. ఇక్కడ కొంత సమతుల్యత పాటించాల్సి వుంది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనం వుంటుంది, నిజమే, కానీ, రిజర్వేషన్ ప్రయోజనాలను అవకాశంగా తీసుకుని తల్లిదండ్రులు ఒక స్థాయికి చేరుకున్నారు." అని బెంచ్ వ్యాఖ్యానించింది. రిజర్వ్‌డ్ కేటగిరీ కింద కర్నా టక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో పిటిషనర్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)గా నియామకానికి సెలక్ట్ అయ్యాడు. అయితే జిల్లా కులాలు, ఆదాయాల నిర్ధారణ కమిటీ పిటిషనర్‌కు కుల ధ్రు వీకరణ సర్టిఫికెట్‌ను ఇవ్వడానికి నిరాకరించింది. క్రీమీ లేయర్ పరిధిలోకి పిటిషనర్ వచ్చినందున తాము సర్టిఫికెట్ ఇవ్వలేమని తేల్చి చెప్పింది. పిటిషనర్ తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులని, వారిద్దరి ఆదాయం నిర్దేశిత క్రీమీ లేయర్ పరిధి రూ.8లక్షలను కూడా దాటి పోయిందని అధికారులు తెలిపారు. దాంతో కురుబ కమ్యూనిటీకి చెందిన వ్యక్తిగా పేర్కొంటూ ఇచ్చిన కుల సర్టిఫికెట్‌ను రద్దు చేశారు.

# నేడు చిత్తూరు జిల్లాలో సీఎం పర్యటన

## - కండ్రిగలో 'సంజీవని'కి హాజరు

**అమరావతి -ఆంధ్రనాడు, మే 22**

ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొనేందుకు సిఎం చంద్రబాబు నాయుడు శనివారం చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు అమరావతి క్యాంపు ఆఫీసు నుంచి బయలుదేరి ఉదయం 11 గంటలకు జిల్లాలోని యాదమర్రి మండలం కండ్రిగ గ్రామం చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా వేదికలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:35 గంటలకు సంతగేటు ప్రభుత్వాస్పత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2:20 గంటలకు సంతగేటు దగ్గర నిర్వహించే కేడర్ సమావేశంలో పాల్గొని పార్టీ కార్యకర్తలకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం 4 గంటలకు తిరుగు ప్రయాణమై అమరావతికి చేరుకుంటారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉంచాలని స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

తీవ్రస్థాయి ఎల్‌నినో కారణంగా వడగాల్పుల తీవ్రత గణనీయంగా పెరిగిందని అధికారులు సిఎంకు వివరించారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1,349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియజేశారు.

**తాగునీటి కొరత లేకుండా చర్యలు**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయ్యిందని, ఈ ఏడాదిలోనూ ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదైనట్టు అధికారులు వివరించారు. గత మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే... పచ్చదనం పెరుగుతుందని... తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమనం లభిస్తుందని అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని వెల్లడించారు.

ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ సమీక్షలో సిఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పీఎన్‌జీ విస్తరణకు చర్యలు వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఐటిఐ, పాలిటెక్నిక్‌తో పాటు ఇతర విద్యార్థులకు నైపుణ్య సంస్థలు పిఎన్‌జి టెక్నికల్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన ప్రతి జిల్లాలో 15 రోజులకు ఒక బ్యాచ్‌గా 100 మంది యువతకు ఉచిత వసతి, భోజనం, ఉపకార వేతనంతో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పిఎన్‌జి వినియోగం వల్ల ఖర్చు తగ్గడం, భద్రత మెరుగుపడడం వంటి అంశాలపై మహిళల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సెర్ప్, మెప్మా ద్వారా మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్యాస్ కంపెనీలు మహిళా సంఘాలతో సమన్వయం చేసుకుని వారికి ప్రోత్సాహకాలు అందిం చాలన్నారు. రాష్ట్రంలో అన్నదానం నిర్వహించే ప్రధాన ఆలయాల్లో పిఎన్‌జి వినియోగాన్ని తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే కొన్ని ఆలయాలు పిఎన్‌జికి మారాయని, మిగిలిన ఆలయాల్లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

కనకదుర్గమ్మ, శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయాల వద్ద నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అద్దె ఇళ్లలో నివసించే వారికి పిఎన్‌జి కనెక్షన్ల వినియోగంపై సరళ నిబంధనలు తీసుకురానున్నట్లు తెలిపారు. వినియోగదారులకు కూడా 'దీపం-2' పథకం కింద ఏడాదికి రూ.2,400 రాయితీ అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గ్రూప్ హౌస్‌లలో వేగంగా పిఎన్‌జి విస్తరణకు కంపెనీలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు, శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నపూర్ తదితరులు పాల్గొన్నారు.?

## పాస్టర్ అభినయ్ దర్శన్ వెనుక

# రాజకీయ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)


లేకపోతే కడప జిల్లాకు చెందిన అభినయ్ దర్శన్... అంతదూరంలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని హోం మంత్రి అనిత ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను నమ్మించి ఆయన పాస్టర్ అవతారం ఎత్తారని ఆమె ఆరోపించారు. అక్కడ ఆయనపై ఎలాంటి దాడి జరగకపోయినా, జరిగినట్లుగా చిత్రీకరించి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఈ డ్రామా వెనుక ఎవరెవరు ఉన్నారనేది పోలీసుల దర్యాప్తులో త్వరలోనే పూర్తిగా బయటపడుతుందని ఆమె స్పష్టం చేశారు. అభినయ్ దర్శన్‌పై గతంలోనే పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని, సమాజంలో వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఆయన నిరంతరం ప్రయత్నిస్తున్నారని హోం మంత్రి వెల్లడించారు. కూటమి ప్రభుత్వాన్ని ఎలాగైనా అప్రదిష్ఠ పాలుచేయాలనే దురుద్దేశంతోనే ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నారా అనే యాంగిల్‌లో కూడా విచారణ సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇటువంటి నాటకాలు, కుట్రలు అస్సలు చెల్లవని, ఇలాంటి ఆలోచనలు ఇంకెవరికైనా ఉంటే తక్షణమే మానుకోవాలని ఆమె హితవు పలికారు. చట్టాన్ని అతిక్రమించి సమాజంలో అలజడులు సృష్టించాలని చూస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు అభినయ్ దర్శన్‌ను త్వరలోనే పోలీస్ కస్టడీలోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారిస్తామని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

# త్రిభాషా సూత్రంపై సుప్రీంలో పిటిషన్

## - విచారణకు స్వీకరించిన ధర్మాసనం

**న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, మే 22:**

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధన (త్రిభాషా సూత్రం)ను తప్పనిసరి చేస్తూ తీసుకొచ్చిన నూతన విద్యా విధానం న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరపున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నట్లుండి మూడు భాషలు ఎలా నేర్చుకుంటారని, ఆ తర్వాత పదో తరగతి పరీక్షలు ఎలా రాస్తారని ఆయన కోర్టులో ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ వాదనలను పరిశీలించిన సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం, ఈ పిటిషన్‌పై వచ్చే వారం సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది.



# అగ్ని-1 క్షిపణి ప్రయోగం విజయవంతం

- రైలు నుంచీ ప్రయోగించే సామర్థ్యం సాధించిన భారత్
- అగ్ని-1 స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతం
- ఒడిశాలోని చాందీపూర్ నుంచి ఈ పరీక్ష నిర్వహణ
- రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి అగ్ని-ప్రైమ్ క్షిపణి ప్రయోగం కూడా సక్సెస్
- రైలు ద్వారా క్షిపణిని ప్రయోగించే సామర్థ్యం సాధించిన కొద్ది దేశాల జాబితాలో భారత్
- డీఆర్డీఓ, సైనిక బలగాలను అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**అమరావతి -ఆంధ్రనాడు, మే 22**

భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-1'ను శుక్రవారం విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వ్యూహాత్మక బలగాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ఈ పరీక్షలో క్షిపణికి సంబంధించిన అన్ని కార్యాచరణ, సాంకేతిక పారామితులను విజయవంతంగా ధృవీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, భారత్ ఇటీవలే క్షిపణి ప్రయోగాల్లో సరికొత్త సామర్థ్యాన్ని సాధించింది. గతేడాది సెప్టెంబర్ 24న, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో), ఎస్ఎఫ్‌సీ సంయుక్తంగా 'అగ్ని-ప్రైమ్' క్షిపణిని రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుంచి విజయవంతంగా ప్రయోగించాయి. దేశంలో ఈ తరహా ప్రయోగం జరగడం ఇదే ప్రథమం. ఈ అగ్ని-ప్రైమ్ క్షిపణి 2,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. రైల్ నెట్‌వర్క్‌పై దేశంలో ఎక్కడికైనా వేగంగా తరలించి, శత్రువుల కంటపడకుండా చాలా తక్కువ సమయంలో ప్రయోగించే సౌలభ్యం ఈ రైల్ మొబైల్ లాంచర్ ప్రత్యేకత. ఈ విజయవంతమైన ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీఓ, ఎస్ఎఫ్‌సీ, సాయుధ బలగాలను ఆయన అభినందించారు. రైల్ నెట్‌వర్క్ నుంచి క్షిపణిని ప్రయోగించే వ్యవస్థను అభివృద్ధి చేసిన కొద్ది దేశాల సరసన భారత్ నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రోడ్ మొబైల్ అగ్ని-పి క్షిపణి సైన్యంలో సేవలందిస్తుండగా, ఈ కొత్త సామర్థ్యం దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది.

# వెటరన్ జర్నలిస్ట్స్ డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

- పెన్షన్ మంజూరుకై ప్రభుత్వానికి సిఫార్స్



**తిరుపతి, మే 22, (ఆంధ్రనాడు):** వెటరన్ జర్నలిస్ట్ లకు పెన్షన్ మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సిపార్సు చేస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలియజేయారు. శుక్రవారం తిరుపతి కలెక్టర్ చాంబర్ లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీసికువచ్చిన 2025–26 సంవత్సరపు డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెటరన్ జర్నలిస్ట్ ల సంక్షేమం కోసం జిల్లా అసోసియేషన్ చేస్తున్న కృషిని కొనియాడారు. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలలో వెటరన్ జర్నలిస్ట్ లకు ప్రభుత్వాలు పెన్షన్ అందజేస్తున్నట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు మాత్రమే దక్షిణ భారత్ లో ఈ విషయంలో వెనకబడ్డాయని పేర్కొన్నారు. అర్హులైన సీనియర్స్ జర్నలిస్ట్ లకు పెన్షన్ మంజూరు విషయం ఎంతో సమంజసమని రాష్ట్ర ప్రభుత్వంనకు సానుకూలంగా ప్రతిపాదన పంపగలనని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, జాతీయ ఉపాధ్యక్షులు డా. టి. జనార్దన్, జిల్లా కార్యదర్శి కె.. చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి యం. సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ ను దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ లు, యాసిన్, జి. సుకుమార్, కృష్ణమూర్తి, మునికృష్ణయ్య, సుధాకర్ రెడ్డి, రాజగోపాల్, అల్లాభక్ష్, కోటయ్య, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంగారు తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ అభయం



**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 22:** శ్రీవారి దేవేరి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు (అలిమేలు మంగమ్మ) శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి పై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. శుక్రవారంలో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవర్లను వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకెళ్లి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి వైభవంగా ఉంజల సేవ నిర్వహించారు. అనంతరం బంగారు తిరుచ్చిపై కొలువు దీర్చి అమ్మవారిని తిరుమాడా వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కర్పూర నీరాజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఆలయ ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్లు రమేష్, సురేష్, మునిచంగల్రాయులు ఇన్స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని సేవలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి



**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 22:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని శుక్రవారం కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్. యడియూరప్ప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద మాజీ ముఖ్యమంత్రికి ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ సురేష్, మునిచంగల్రాయులు, రమేష్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, చలపతి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## గ్రామాలను వణికిస్తున్న గజరాజులను బందించండి



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 22:** పలమనేరు రూరల్ మండలం లోని పెంగరగుంట పంచాయతీలోని మొసలి మడుగు,బండమీద ఇళ్ళు ఏటి గడ్డ, ఇందిరానగర్, క్రిష్ణాపురం, కాలవపల్లి, ఊసర పెంట తదితర గ్రామాలపై గత వారం రోజులుగా రెండు జంట ఏనుగులు విడివిడిగా వచ్చి గ్రామాలను వణికిస్తున్నాయి. వాటిని మళ్ళించడానికి ప్రయత్నిస్తున్న అటవీశాఖ అధికారులు, ట్రాకర్స్, రైతులపై కూడా క్రూరంగా తిరగబడి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అడవి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక సోలార్ ఫెన్సింగ్, కొత్తగా వేసిన హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్ లను కూడా అనేక చోట్ల విరిచేసి పంటపొలాలపైకి చొరబడి వస్తున్నాయి.ఇలా వారం రోజులుగా సమీప గ్రామాలను వణికిస్తున్న ఈ జంట ఏనుగులను వెంటనే బందించాలని చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు రైతులు కోరుతున్నారు.

# ఆర్టీసి ఈవి చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులు వేగవంతం

- సమీక్షా సమావేశంలో ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 22:** ఎపిఎస్పిడిసిఎల్ పరిది లోని నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఈవి చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. ఎపిఎస్పిసిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నందు శుక్రవారం ఆయా జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఆర్టీసి అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఎస్పిడీసీఎల్ పరిధిలో నెల్లూరు, కడవ, అనంతపుం, కర్నూలు, మంగళం వద్ద ఆర్టీసి బస్సుల కోసం ఎపిఎస్పిడిసిఎల్ ఆధ్వర్యంలో ఈవి చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ పనుల్ని చేపడుతున్న కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత నివ్వాలని, ఎపిఎస్పిడిసిఎల్, ఎపిఎస్ఆర్టీసి అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఈ యేడాది జూన్ 20వతేదీ లోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. పనులను చేపట్టే సందర్భాల్లో ఏవైనా అడ్డంకులు ఏర్పడినట్లయితే సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ను సంప్రదించి, సమస్యల్ని పరిష్కరించుకుని, పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ఐటి) పి. ఆయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ & హెచ్ఆర్ డి) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ కె. సంపత్ కు మార్, జనరల్ మేనేజర్ జగదీష్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు రాఘవేంద్రం, శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, చంద్రశేఖర్, ఆర్టీసి రీజనల్ మేనేజర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# టీటీడీ ఇఓ హామీతో స్విమ్స్‌లో ఆమరణ దీక్షలు వాయిదా

- గురువారం నాటి రాత్రి సిఐటియు నేతలతో జేఇఓ శరత్ చర్చలు
- ఇఓ హామీతో 85 రోజులుగా సాగుతున్న రిలే దీక్షల విరమణ





**తిరుపతి – ఆంధ్రనాడు, మే 22:** స్విమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం నుండి సిఐటియు ఆధ్వర్యంలో తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షలు వాయిదా పడ్డాయి. టీటీడీ ఇఓ స్వయంగా జోక్యం చేసుకోవడం, జేఇఓ శరత్ చర్చల్లో పాల్గొనడం, డైరెక్టర్ ఆర్ వి కుమార్ రాతపూర్వ హామీని కార్మికులకు అందించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ కార్మికులు తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షలు, రిలే దీక్షలను వాయిదా వేస్తున్నట్టు యూనియన్ నేతలు ప్రకటించారు. సమస్య నేపధ్యం ఇలా ఉంది. స్విమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న 816 మంది కార్మికుల సమస్యల పరిష్కారంలో సాగుతున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్విమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో గత 85 రోజులుగా రిలే దీక్షలు సాగుతున్న విషయం విధితమే. ఉద్యమ సమయంలో రూకేష్ బాబు అనే కార్మికుడు మరణించడం కుమారి అనే మహిళ కార్మికురాలు గుండెపోటుకు గురికావడం లాంటి ఘటనలు స్విమ్స్ ఆసుపత్రిలో తీవ్ర ఉద్రిక్తత కు కారణాలయ్యాయి. ఇలాంటి పరిస్థితులలో శుక్రవారం నాటి నుంచి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిఐటియు నగర నేత కే. వేణుగోపాల్ మరికొందరు కార్మికులు ఆమరణ దీక్షలకు సన్నద్ధమయ్యారు. నష్ట నివారణకు టీటీడీ ఈఓ ముద్దాడ రవిచంద్ర రంగంలోకి దిగి సిఐటియు నేతలతో మాట్లాడారు. కార్మికులకు జరిగిన నష్టాన్ని సిఐటియు నేత కందారపు మురళి ఇఓ రవిచంద్రకి వివరించారు. గత నాలుగేళ్లలో ఒక్కో కార్మికుడు ఐదు లక్షల రూపాయలు నష్టపోయారని ఇఓకు తెలిపారు. సమస్య పరిష్కారానికి తానే బాధ్యత తీసుకుంటానని ఇఓ హామీ ఇచ్చారు. తన ప్రతినిధిగా సీనియర్ ఐఏఎస్ అధికారి జేఈఓ శరత్ ను గురువారం నాటి రాత్రి చర్చలకు పంపారు. స్విమ్స్ ఆసుపత్రిలోని డైరెక్టర్ ఛాంబర్‌లో గురువారం రాత్రి జెఇఓ శరత్ తో సిఐటియు నేతలు కందారపుమురళి, వినాగరాజు, కె వేణుగోపాల్, స్విమ్స్ కార్మిక నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. చర్చల అనంతరం జెఇఓ శరత్ మాట్లాడు తూ కార్మికులకు ఇంతటి అన్యాయం జరిగిందని తమ దృష్టిలో లేదని, కొంత సమయం ఇస్తే తాము సమస్య పరిష్కారానికి తోడ్పడుతామని ఇఓ హామీ మేరకు ఆందోళన విరమించాలని విజ్ఞప్తి చేశారు. రాతపూర్వక హామీని ఇస్తామని సంపూర్ణంగా సమస్యల పరిష్కారానికి టిటిడి యాజమాన్యం తోడ్పడుతుందని తెలిపారు.దీంతో శుక్రవారం నాటి ఉదయం వందలాదిమంది కార్మికుల సమక్షంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వి కుమార్ చర్చల వివరాలను యాజమాన్యం ఇచ్చిన హామీలను కార్మికులకు వివరించా రు. తాము మూడు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా కార్మికుల సమక్షంలో సిఐటియు నేతలకు అందించారు. ఈ కార్యక్రమంలో టి. సుబ్రమణ్యం, ఎస్. జయచంద్ర, జి బాలసుబ్రమణ్యం, కే వేణుగోపాల్, మాధవ్, ఆర్ లక్ష్మి, మునిరాజా నాగ వెంకటేష్, బుజ్జి, సాయి లక్ష్మి జయంతి, రమేష్, వాసు, బాదుల్లా తో పాటు స్విమ్స్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రవి, మారిముత్తు, సూరి, గోపి, జయమ్మ లతో పాటు స్విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, సీఈవో గోపి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఐ రిస్క్ గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ ఆసుపత్రిలోని కాన్పు అవ్వండి
- అత్యవసర సమయాల్లో 108 వాహనాన్ని ఉపయోగించుకోండి
- ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత కాన్పు తల్లి బిడ్డ క్షేమం



**రేణిగుంట, మే 22, (ఆంధ్రనాడు):** ఐ రిస్క్ గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించటం తో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో నే కాన్పు అవ్వాలని అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తారకరామా నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎం.పీ.హెచ్.ఈ.ఓ.కే. ఆర్ ప్రకాష్, తెలియజేశారు. శుక్రవారం రేణిగుంట పంచాయతీ పరిధిలోని రేణిగుంట.5 సచివాలయం పరిధిలో ఉన్న సి.బి.ఐ.డి కాలనీ నందు ఐ రిస్క్ గర్భిణీ స్త్రీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎం.పి.హెచ్.ఈ.ఓ. ప్రకాష్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలును సకాలంలో నమోదు చేసి వారికి టీకాలు వేసుకోవాలని కోరారు. అదే విధంగా గర్భిణీ స్త్రీలకు టీకాలపై కూడా అవగాహన కల్పించడంతోపాటు పుట్టేటువంటి బిడ్డకు కూడా సకాలంలో టీకాలు వేసుకుంటే వ్యాధులనుంచి దూరంగా ఉండవచ్చు అని అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని కాన్పు అయ్యేలా వారికి అవగాహన కల్పించడంతో పాటు. ఐ.రిస్క్ ఉన్న గర్భిణీ స్త్రీలు గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత పై వారికి అవగాహన కల్పించామన్నారు. ప్రతినెల 9వ తేదీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ప్రధానమంత్రి మాతృత వందన యోజన కార్యక్రమానికి వారిని తీసుకుని వచ్చి వారికి ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే అత్యవసర సమయాల్లో 108 వాహనాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖవంతమైన కాన్పు అవుతారని వారికి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పుష్పా, ఎంఎల్.హెచ్.పి. స్రవంతి, ఏ.ఎన్.ఎం రేవతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవ వైవిధ్యమే మన జీవన విధానం కావాలి

- వైల్డ్‌లైఫ్ రేంజర్ బి. సుదర్శన్ రెడ్డి



**తిరుపతి, ఆంధ్రనాడు, మే 22:** భూమిపై ఉన్న వివిధ జీవజాతులు ప్రకృతికి అందాన్ని తీసుకువస్తున్నాయని, పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు, అమరావతి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా నేషనల్ గ్రీన్ కార్ప్స్, వేమన విజ్ఞాన కేంద్రం మరియు విశ్వం విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జీవ వైవిధ్య అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం చిత్రలేఖనం, వ్యాసరచన మరియు అనిమల్ మాస్క్ తయారీ పోటీలు నిర్వహించగా, మొత్తం 135 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అనకాపల్లి, కాకినాడ, గుంటూరు, అనంతపురం మరియు తిరుపతి జిల్లాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ తెలిపారు. పోటీల్లో విజేతలకు విశ్వం విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, జిల్లా కోఆర్డినేటర్ జయకర్, జేవీవీ జిల్లాకార్యదర్శి రెడ్డప్ప, మునిలక్ష్మి, ఆమూరి సుబ్రమణ్యం, చెస్ బాలాజీ చౌదరి, తిమ్మప్ప, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ జీవ వైవిధ్యం ప్రకృతి సమతౌల్యానికి మూలాధారమని పేర్కొన్నారు. ప్రతి జీవి ప్రకృతి వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుందని, పక్షులు, జంతువులు, మొక్కలు మరియు సూక్ష్మజీవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులను పరిరక్షించడం, మొక్కలు నాటడం మరియు పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించ వచ్చని సూచించారు. అలాగే వాతావరణ మార్పులు, అటవీ వినాశనం, కాలుష్యం వంటి సమస్యలు జీవ వైవిధ్యానికి ముప్పుగా మారుతున్నాయని పేర్కొంటూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతాభావం పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని తెలిపారు.

# అమ్మవారి ఆలయ ప్రసాదాల ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీకాంత్ బాధ్యతలు



**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 22:** అమ్మవారి ఆలయ ప్రసాదాల ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీకాంత్ శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ జ్యువెలరీ విభాగం నుంచి బదిలీపై ఆయన అమ్మవారి ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పరిపాలనా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ప్రసాదాల నిర్వహణ, పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని లక్ష్మీకాంత్ పేర్కొన్నారు.

# మిట్స్‌లో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్‌పై అవగాహన



**కురబలకోట – ఆంధ్రనాడు, మే 22:** మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్‌పై క్యాడెట్లకు ప్రత్యేక అవగాహన, అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా 11 (ఆంధ్ర) ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్), ఎన్‌సీసీ తిరుపతి కమాండ్ ఆఫీసర్ కెప్టెన్ ఆర్.జె. అత్రే హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ప్రతిపాదించిన డ్రోన్ ల్యాబ్‌ను పరిశీలించిన ఆయన, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందించారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి, సమయపాలన వంటి లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. రక్షణ రంగంలో కెరీర్ ఆశించే వారికి ఎన్‌సీసీ ఎంతో ఉపయోగకరమని, శిక్షణా శిబిరాలు, పరేడ్‌లు, అడ్వెంచర్ కార్యక్రమాలతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని వివరించారు. 'సి' సర్టిఫికెట్ కలిగిన వారికి రక్షణ విభాగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత, అదనపు మార్కులు, నేరుగా ఇంటర్వ్యూ అవకాశాలు ఉంటాయని చెప్పారు. పోలీసు, పారామిలిటరీ, సివిల్ సర్వీసులు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో కూడా ఎన్‌సీసీ అనుభవం ఉన్న వారికి మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు దేశ నిర్మాణానికి కీలకమని, విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్, ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ కేర్‌టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ నవీన్ కుమార్, క్యాడెట్లు పాల్గొన్నారు.

# గ్రీన్ మ్యాన్యూర్‌తో నేల సారవంతం

**- రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి సూచనలు**



**కురబలకోట – ఆంధ్రనాడు, మే 22:** మండలం కనసానివారిపల్లి ఆర్‌ఎస్‌కేను జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ శుక్రవారం సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులకు ఏ పి ఎ ఐ ఎం ఎస్ ద్వారా రైతు నమోదు విధానం, చిరుధాన్యాల సాగు ప్రాధాన్యత, గ్రీన్ మ్యాన్యూర్ విత్తనాల పంపిణీ తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రీన్ మ్యాన్యూర్ వినియోగం వల్ల నేలలో సేంద్రీయ పదార్థాలు పెరిగి, భూమి సారవంతం మెరుగుపడుతుందని తెలిపారు. దీని ద్వారా రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గి, ఖర్చులు తగ్గడంతో పాటు పంటల దిగుబడులు పెరుగుతాయని వివరించారు. రైతులు ఆధునిక, శాస్త్రీయ పద్ధతులను అనుసరించి సాగు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినూత, ఆర్‌బికే సిబ్బంది భూదేవి, మురళి, మండలం లోని స్థానిక రైతులు పాల్గొన్నారు.

# అధికారులను ప్రశ్నించినదానికి జీవనోపాధికి గండి



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 22 :** తిరుమల పాప వినాశంలో తాము నాలుగు దశాబ్దాలు జీవిస్తున్నామని ఈ మధ్య కాలంలో ఫారెస్ట్ అధికారులు తమను వేధిస్తూ మా వ్యాపారాలకు గండి కొడుతున్నారని షికారిల నాయకుడు రాధాకృష్ణ ఆరోపణలు చేస్తూ, ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ అమ్మవారి ప్రాచుర్యం భక్తులకు తెలియజేసే బోర్డులను తొలగించి ఆ స్థలంలో దుకాణం ఏర్పాటు చేయాలని కొందరు ప్రయత్నిస్తే, ఆ విషయంపై ప్రశ్నిస్తే మాపై కక్ష కట్టి ఫారెస్ట్ అధికారులు మా వ్యాపారాలకు గండి కొడుతున్నారని ఆరోపించారు.

# నేటి నుంచి అరసం రాష్ట్ర మహాసభలు

**- ఏపీతో సహా వివిధ రాష్ట్రాల నుండి 300 మంది ప్రతినిధులు హాజరు**

**- మహాసభలకు సర్వం సిద్ధం**



**తిరుపతి, మే 22 (ఆంధ్రనాడు):** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 20వ రాష్ట్ర మహాసభలు తిరుపతి నగరంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. రాష్ట్ర మహాసభలతో పాటు 83వ వార్షికోత్సవాన్ని కలిపి నిర్వహిస్తున్నారు. నగరంలో సిపిఐ కార్యాలయంలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ అరసం రాష్ట్ర మహాసభలకు వేదిక అయింది. 40 సంవత్సరాల అనంతరం అరసం మహాసభలు మరోసారి తిరుపతిలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సదస్సులు, పుస్తకావిష్కరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ తోపాటు వివిధ రాష్ట్రాల నుండి 300 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరు అవుతున్నారు. తొలిరోజు శనివారం ఉదయం జరిగే ప్రారంభ కార్యక్రమం వేదికకు శంకరంబాడి సుందరాచారి పేరు ఖరారు చేశారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమానికి హాజరయ్యే ప్రతినిధుల నమోదు మొదలవుతుంది. అనంతరం 10:30 గంటల నుంచి 1:00 వరకు ప్రారంభ సమావేశాన్ని నిర్వహిస్తారు. ప్రారంభ సమావేశానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహిస్తారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ సాకం నాగరాజు, జాతీయ సమన్వయకర్త ఆచార్య కె కాత్యాయని విద్మహే, భారతీయ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ రెడ్డి తోపాటు ప్రముఖ రచయితలు వేల్పుల నారాయణ, డాక్టర్ వల్లేరు వీరాస్వామి, వల్లూరి శివప్రసాద్ ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభల ప్రత్యేక సంచిక విశాలాక్షి మాసపత్రికను సంపాదకులు ఈతకోట సుబ్బారావు, సాకం నాగరాజు ఆవిష్కరిస్తారు.



**ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు**

రెండు రోజులు పాటు తిరుపతిలో జరిగే అరసం మహాసభల ఏర్పాట్లను ఆ సంఘం నాయకులు శుక్రవారం ఉదయం పర్యవేక్షించారు.. ఈ కార్యక్రమంలో అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అరసం రాష్ట్ర, జిల్లా జిల్లా నాయకులు సాకం నాగరాజు, గంటా మోహన్ డాక్టర్ నెమిలేటి కిట్టన్న, నాదెండ్ల శ్రీమన్నారాయణ ఏడుకొండలు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య విశాలాంధ్ర బ్యూరో ఇన్చార్జి డాక్టర్ ఎండి ప్రసాద్, సత్యాల బాదుల్లా తదితరులు పాల్గొన్నారు

**నేటి కార్యక్రమాలు**

తిరుపతి నగరంలో శనివారం ప్రారంభ సమావేశం తర్వాత మధ్యాహ్నం నుంచి వివిధ అంశాలపై సదస్సులు జరుగుతాయి. విద్వాన్ విశ్వం వేదికపై మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు మొదటి సదస్సు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య వేదికపై నాలుగున్నర నుంచి ఐదున్నర గంటల వరకు రెండవ సదస్సు, గజ్జల మల్లారెడ్డి వేదికపై సాయంత్రం ఐదున్నర గంటలకు నేను– నా పుస్తకం, ఆమె నా సూర్యోదయం, సౌందర్య కోన కవిత సంపుటాలు, నాగలి–నానీలు, రణం నుండి శాంతి వైపు, నారీ బేరి పుస్తకాలలో ఆవిష్కరిస్తారు. తొలిరోజు అయిన శనివారం ప్రముఖ రచయితలు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, నల్లి ధర్మారావు, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆచార్య ఈశ్వర్ రెడ్డి, ఆచార్య మధురాంతకం నరేంద్ర, యువశ్రీ మురళి, ఆచార్య కొలకలూరి మధు జ్యోతి, వి ప్రతిమ, పీసీ వెంకటేశ్వర్లు, ఎం ఆర్ అరుణకుమారి, పల్లిపట్టు నాగరాజు, డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ తదితరులు ప్రసంగిస్తారు.

# "బడి పిలుస్తోంది" ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల పెంపే లక్ష్యం

**- అభివృద్ధికి బాటలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు భరోసా**



తిరుపతి – ఆంధ్రనాడు, మే 22: తిరుపతిలోని సత్యనారాయణపురం జెడ్.పి. హైస్కూల్, జూనియర్ కాలేజీలో నిర్వహించిన "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, మబ్బు దేవనారాయణరెడ్డి, అన్నా అనిత, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు నిర్వహించి, విద్యా సంస్థ సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్స్ ప్రక్రియను వేగవంతం చేయడం నాణ్యమైన విద్యను ప్రతి పేద విద్యార్థికి చేరవేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విచ్చేసిన అతిధులు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి క్రమశిక్షణ, క్రీడలు, మరియు వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పదో తరగతి విద్యార్థులకు గత 7 సంవత్సరాలుగా తన సొంత ఖర్చుతో ఎగ్జామ్ ప్యాడ్స్, నోట్ బుక్స్, జ్యామెట్రీ బాక్సులను అందిస్తున్నానని, ఈ ఏడాది కూడా అది కొనసాగుతుందని తెలిపారు. తిరుపతిలో ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, నాణ్యమైన మధ్యాహ్నా భోజనం, ఇతర వసతులు కల్పిస్తున్నామని వివరించారు. పిల్లలను స్కూల్లో చేర్పించడమే కాకుండా, వారి క్రమశిక్షణను, ఆటలను, విద్యా ప్రగతిని తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయుల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గత పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి, వారిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రెటరీ కుమారి, ఎం.ఇ.ఓ బాలాజీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్య రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా 'కిషోర వికాసం' వేసవి శిక్షణ

**- బాలబాలికలకు ఆర్థిక నిర్వహణపై అవగాహన**



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 22:** పలమనేరు అర్బన్ పరిధిలోని రంగాపురం సచివాలయంలో శుక్రవారం 'కిషోర వికాసం' వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఐసీడీఎస్ సీడీపీఓ ఉమారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ శిక్షణా శిబిరంలో భాగంగా,శుక్రవారం 7వ సెషన్‌ను 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల కిషోర బాలబాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. డబ్బు నిర్వహణపై ప్రత్యేక అవగాహన సెషన్‌లో ముఖ్యంగా "ఆర్థిక నిర్వహణ" అనే అంశంపై పిల్లలకు సమగ్ర అవగాహన కల్పించారు. నిత్యజీవితంలో మరియు భవిష్యత్తులో ఆర్థిక క్రమశిక్షణ ఎంత అవసరమో వివరిస్తూ కింది ముఖ్యాంశాలపై చర్చించారు. అసలు డబ్బు విలువ ఏమిటి, సమాజంలో దాని పాత్ర ఏంటనేది వివరించారు. నిత్యావసరాలకు, విలాసాలకు మధ్య ఉన్న తేడాను గుర్తించి మెలగడం. చిన్న వయస్సు నుంచే పొదుపు చేసే అలవాటును ఎలా పెంపొందించుకోవాలి, అది భవిష్యత్తుకు ఎలా తోడ్పడుతుంది అనే విషయాలను తెలిపారు. అనవసర వ్యయాలను అరికట్టి, డబ్బును సురక్షితంగా ఎలా నిర్వహించుకోవాలో నేర్పించారు. భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి ఇప్పటి నుంచే సరైన ఆర్థిక ప్రణాళికను ఎలా సిద్ధం చేసుకోవాలో దిశానిర్దేశం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్ ప్రతినిధి శివశంకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ నజ్మా, వన్ స్టాప్ సెంటర్ ఏఎస్ఐ శ్యామల, వార్డ్ అడ్మిన్ జైపద్, మరియు మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త చిలకమ్మ, హెల్పర్లు పరిమళ, కస్తూరి, సులోచనమ్మలతో పాటు కిషోర బాలబాలికలు పాల్గొన్నారు.

# పుంగనూరు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ హాజీ పి. వాహీదున్నిసా హఠాన్మరణం



**పుంగనూరు – ఆంధ్రనాడు, మే 22:** పుంగనూరు మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ హాజీ పి. వాహీదున్నిసా శుక్రవారం ఈరోజు ఉదయం కన్నుమూశారు. గత కొంతకా లంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, బెంగళూరులోని వైదేహి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుండి వహీదున్నిస పార్టీ కోసం ఎనలేని కృషి చేశారు, పుంగనూరు మున్సిపల్ చైర్మన్ గా ?ఆమె 1995 నుండి 2000 సంవత్సరం వరకు పుంగనూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పట్టణ ప్రజలకు విశేష సేవలందించారు. ఆమె పదవీకాలంలో పుంగనూరు పట్టణ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. నిగర్వి‌గా, ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్న హాజీ పి. వాహీదున్నిసా గారి మరణం పుంగనూరు ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ?ఆమె హఠాన్మరణం పట్ల స్థానిక రాజకీయ నాయకులు, ప్రముఖులు మరియు పుంగనూరు మున్సిపల్ సిబ్బంది తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు రాజకీయ నాయకులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# బిజెపి నాయకుని కుమార్తె పెళ్లికి ప్రధాని నరేంద్ర మోడీ అభినందన లేఖ



**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 22:** భారతీయ జనతా పార్టీ కార్యకర్తకు నాయకులకు ఢిల్లీ స్థాయిలో కూడా నాయకులు మర్యాద ఇవ్వడం గొప్ప సంస్కృతి దీనికి నిదర్శనం చిత్తూరు జిల్లా భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి అట్లూరు శ్రీనివాసులు కుమార్తె తేజస్వికి ఈనెల 27న చిత్తూరులో వివాహం జరగనున్నది ఈ విషయం ఆయన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పెళ్ళికి రావాల ని పోస్ట్ ద్వారా పెళ్లి కార్డు పంపారు ఎ న్నో దేశ రాజకీయాల్లో బిజీగా ఉన్న ఆ యన స్పందించి పెళ్లి కుమార్తెకు వారి కుటుంబానికి ఆశీర్వదిస్తూ అభినందిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ లేక పంపారు దానితో బిజెపి లో ఉన్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి తమ కుమార్తెఏ తేజస్వికి అభినందించి ఉత్తరం పంపడం పట్ల ఆ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు దేశం కోసం పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు అధిష్టానం గుర్తించడం గొప్ప విషయం అని భారతీయ జనతా పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# గ్రామాలలో త్రాగునీటి సమస్య నివారిస్తాం: ఎంపీడీవో ఈశ్వరన్న





**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 22:** రామకుప్పం మండలం విజాలాపురం వీర నమల పంచాయతీలలో రామకుప్పం ఎంపీడీవో ఈశ్వరన్న పర్యటించారు కడ ప్రత్యేక అధికారి వికాస్ మరమ్మత్ ఆదేశాలతో గ్రామాలలో పారిశుద్ధ పనులు వేసవిలో త్రాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు దానితో ఎంపీడీవో ఈశ్వరన్న గ్రామాలలో పర్యటించి పారిశుద్ధ పనులను నీటి సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి సమీక్ష నిర్వహించారు ఎక్కడ గాని ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని ముఖ్యంగా మురికి కాలువలలో త్రాగునీటి పైపులు వేయరాదని సిబ్బందికి సూచించారు దీనివల్ల అంటూ రోగాలు వస్తాయి అని ఆయన పేర్కొన్నారు.

# ద్రౌపది ధర్మరాజుల గెరిగి మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పెద్దపంజాణి, ఆంధ్రనా డు, మే 22 :** మండ లంలోని అప్పినపల్లిలో అత్యంత వైభవంగా ని ర్వహించే ద్రౌపది దేవీ స మేత ధర్మరాజుల స్వామి ఆలయ గెరిగ మహోత్స వం, కల్యాణోత్సవ కార్య క్రమంలో పలమనేరు శాసనసభ్యులు అమరనా థ రెడ్డి గురువారం రాత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సి.ఆర్. రాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, రాజన్ లను సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో పలమనేరు ఏఎంసీ చైర్మన్ రాజన్న, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, నాయకులు మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, జయరాంరెడ్డి, శ్రీరాములు, రోజారెడ్డి, భానుప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు గారూ...! మామిడి రైతును ఆదుకోండి

- గుజ్జు ఎగుమతి సుంకం రద్దు చేయండి
- మామిడి బోర్డు ఏర్పాటు చేయండి
- ధర స్థిరీకరణతోనే రైతులకు న్యాయం
- గుజ్జును ప్రధాన ఆలయాలకు సరఫరా చేయండి
- ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు

**తిరుపతి– ఆంధ్రనాడు, మే 22:**

"చంద్రబాబు గారూ...! మామిడి రైతులకు న్యాయం చేయండి. విదేశాలకు మామిడి గుజ్జును ఎగుమతి చేయడానికి విధిస్తున్న 32శాతం సుంకం రద్దు చేయండి. ఇలా చేస్తే రైతుకు ధర గిట్టుబాటు అవుతుంది. మామిడి బోర్డును ఏర్పాటు చేయండి. ధరల స్థిరీకరణతోనే రైతులకు న్యాయం జరుగుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తయారు చేసే మామిడి గుజ్జును టీటీడీతో పాటు.. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు సరఫరా చేయండి. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కోడిగుడ్డుతో పాటు మామిడి పండ్లు కూడా ఇవ్వండి. ఇలా చేస్తే మామిడికి డిమాండు పెరుగుతుంది." అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమరిలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో రామానాయుడు రైతుల తరపున బహిరంగ లేఖ రాశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

"ఒకప్పుడు 'రాజఫలం'గా వెలిగి, రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చేసిన మామిడి పంట నేడు ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు కన్నీటికి కారణమవుతోంది. ఆకాశాన్నంటే శ్రమ, పాతాళానికి పడిపోతున్న ధరలు, పాలకుల ఉదాసీనత, దళారుల సిండికేట్ కోరల మధ్య నలిగిపోతున్న మామిడి రైతు గుండె ఘోష నేడు వర్ణనాతీతం. రాయలసీమను 'ఉద్యానవన హబ్' గా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి సంకల్పం గొప్పదే అయినా, క్షేత్రస్థాయిలో వెన్నెముక లాంటి మామిడి రైతు బతుకు చిత్రం మారనంత కాలం ఆ హబ్ నినాదం కాగితాలకే పరిమితమవుతుంది. ఒకపుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెరకు ప్రధాన పంటగా ఉండేది. పాలకుల విధానాలు, నిర్లక్ష్యం కారణంగా చెరకు ఇక్కడ కనుమరుగు అవుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరు చక్కెర పరిశ్రమలు మూతపడ్డాయి. చెరకు లాగా మామిడి కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది."

**4 లక్షల మంది జీవనాధారం**

"ఉమ్మడి చిత్తూరు జిల్లా అంతటా విస్తరించి ఉన్న మామిడి తోటలు కేవలం ఒక పంట కాదు, ఈ ప్రాంత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి. గణాంకాలు చూస్తే ఈ రంగం ఎంత విస్తృతమైనదో అర్థమవుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 70 వేల హెక్టార్లలో 'తోతాపురి' సాగవుతుండగా, మరో 42 వేల హెక్టార్లలో 'టేబుల్' (బంగినపల్లి, నీలం తదితర) రకాలు సాగవుతున్నాయి. ప్రతి ఏటా సగటున 7.50 లక్షల టన్నుల మామిడి కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. ఇందులో అత్యధికంగా 5 లక్షల టన్నులు తోతాపురి రకమే కావడం విశేషం. మిగిలిన 2.50 లక్షల టన్నులు ఇతర రకాలు. ఈ సాగుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4 లక్షల మంది కూలీలు, రవాణాదారులు, హమాలీలు ఆధారపడి బతుకుతున్నారు. వీరిలో స్వయంగా రక్తాన్ని చెమటగా మార్చి తోటలు పెంచుతున్న రైతులే 70 వేల మంది వరకు ఉన్నారు. ఇంతటి ఉపాధిని కల్పిస్తున్న ఒక సుసంపన్నమైన రంగం.. నేడు పాలనాపరమైన లోపాలు, మార్కెట్ మాయాజాలం వల్ల కుప్పకూలే స్థితికి చేరుకుంది."



**32 శాతం ఎగుమతి సుంకం**

"ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తయారయ్యే మామిడి గుజ్జుకు అంతర్జాతీయంగా తిరుగులేని డిమాండ్ ఉంది. ఇక్కడి పల్ప్ చైనా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, పోలెండ్, ఉక్రెయిన్, బెల్జియం, ఆస్ట్రేలియా, డెన్మార్క్, నార్వే, స్వీడన్, హంగేరియా, ఫిన్లాండ్, నెదర్లాండ్స్ వంటి ప్రపంచవ్యాప్త 48 దేశాలకు ఎగుమతి అవుతోంది. ఇది మన రాష్టానికి ఎంతో గర్వకారణం, దేశానికి విదేశీ మార్పిడి తెచ్చే వనరు. ప్రతి ఏటా మామిడితో రూ.1,200కోట్లు వరకు విదేశీ మారక ద్రవ్యం చిత్తూరు జిల్లాకు వస్తోంది. కానీ, ఈ గుజ్జు ఎగుమతిపై విధిస్తున్న 32 శాతం భారీ సుంకం నేడు ఇక్కడి పరిశ్రమల పాలిట, తద్వారా రైతుల పాలిట శాపంగా మారింది. ఒకప్పుడు జిల్లాలో 62 మామిడి గుజ్జు పరిశ్రమలు కళకళలాడుతూ నడిచేవి. కానీ ఈ పన్నుల భారం, నిర్వహణ ఖర్చులు భరించలేక ఇప్పటికే 20 పరిశ్రమలు పూర్తిగా మూతపడ్డాయి. ప్రస్తుతం కేవలం 42 పరిశ్రమలు మాత్రమే అరకొరగా కొట్టుమిట్టాడుతున్నాయి. పరిశ్రమల యాజమాన్యాలు ఈ 32 శాతం ఎగుమతి సుంకం భారాన్ని తమ లాభాల నుంచి కాకుండా, దళారీ వ్యవస్థతో చేతులు కలిపి సిండికేట్‌గా మారి రైతుల మెడకు చుడుతున్నాయి. కాయల కొనుగోలు ధరను దారుణంగా తగ్గించి, తాము సేఫ్ జోన్‌లోకి వెళ్తూ రైతును అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. ఈ సుంకాన్ని తక్షణమే రద్దు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఎంతైనా ఉంది."

**ఆలయాలు, బడులతో అనుసంధానం చేయండి**

"కేవలం విదేశీ ఎగుమతులపైనే ఆధారపడితే అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల రైతు నష్టపోతున్నాడు. అందుకే దేశీయంగా, ముఖ్యంగా మన రాష్ట్రంలోనే మామిడికి భారీ అంతర్గత డిమాండ్ సృష్టించే మార్గాలను చూడండి. తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు రాష్ట్రంలోని శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడ కనకదుర్గ, అన్నవరం, సింహాచలం వంటి ప్రధాన పుణ్యక్షేత్రాలలో ప్రతిరోజు లక్షలాది మంది భక్తులకు లడ్డూలు, ప్రసాదాలు, నిత్య అన్నదాన వితరణ జరుగుతుంటాయి. ఈ ఆలయాల్లో ఉపయోగించే స్వీట్లు, పానీయాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తయారయ్యే స్వచ్ఛమైన మామిడి గుజ్జును ఉపయోగించేలా దేవాదాయ శాఖ నిబంధనలు విధించాలి. తిరుమల లడ్డూ నాణ్యత పెంచడానికి, ఇతర ప్రసాదాల రుచి పెంచడానికి ఈ గుజ్జు ఎంతో దోహదపడుతుంది. ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి సేకరించి ఆలయాలకు సరఫరా చేయడం వల్ల మార్కెట్ స్థిరత్వం సాధించవచ్చు."

**మధ్యాహ్న భోజనంలో మామిడి పండ్లు**

"ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో ప్రస్తుతం కోడిగుడ్డు ఇస్తున్నారు. దీనితో పాటు, మామిడి సీజన్‌లో విద్యార్థులకు వారానికి రెండు లేదా మూడు సార్లు పోషక విలువలున్న 'మామిడి పండ్లను' కూడా మెనూలో చేర్చాలి. దీనివల్ల అటు ఎదిగే పిల్లలకు అవసరమైన విటమిన్లు అందుతాయి, ఇటు రైతు పంటకు ఊహించని స్థాయిలో స్థిరమైన డిమాండ్ ఏర్పడి మార్కెట్‌లో ధరలు పడిపోకుండా ఉంటాయి."

**సంక్షోభ నివారణకు చర్యలు తీసుకోండి**

మామిడి రైతు సమస్యను తాత్కాలిక ఉపశమనాలతో కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే చొరవ చూపి, క్రింది వ్యవస్థాగత మార్పులు చేపట్టాలి. పొగాకు, కాఫీ, రబ్బర్, మసాలా దినుసుల తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా చిత్తూరును కేంద్రంగా చేసుకుని 'ప్రత్యేక మామిడి బోర్డు'ను ఏర్పాటు చేయాలి. ఈ బోర్డు ఉంటేనే సాగు విస్తీర్ణం, నాణ్యతా ప్రమాణాలు, అంతర్జాతీయ మార్కెట్ ధరలపై ఒక స్పష్టమైన నియంత్రణ, పరిశోధనలు సాధ్యమవుతాయి. మార్కెట్ ఒడిదొడుకుల నుండి రైతును రక్షించడానికి 'ధరల స్థిరీకరణ నిధి' ద్వారా కనీస గిట్టుబాటు ధరను పటిష్టంగా అమలు చేయాలి. ప్రైవేట్ వ్యాపారుల సిండికేట్ దోపిడీని అడ్డుకోవడానికి ప్రభుత్వమే కనీస మద్దతు ధరతో జోక్యం చేసుకోవాలి. ప్రైవేట్ పల్ప్ పరిశ్రమల ఏకస్వామ్యానికి, దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే, ప్రభుత్వమే సహకార సంఘాల ఆధ్వర్యంలో మామిడి గుజ్జు పరిశ్రమలను స్థాపించి నిర్వహించాలి. దీనివల్ల లాభాలు నేరుగా రైతు ఖాతాకే చేరుతాయి. మామిడి అనేది త్వరగా కుళ్లిపోయే, పాడైపోయే పంట కావడం వల్ల దళారులు చెప్పిన తక్కువ ధరకే రైతు అమ్ముకోవాల్సిన నిస్సహాయ స్థితి ఉంది. ప్రధాన సాగు మండలాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలను నిర్మిస్తే, ధర బాగున్నప్పుడు అమ్ముకునే వెసులుబాటు రైతుకు కలుగుతుంది.' రాయలసీమను హబ్‌గా మార్చే క్రమంలో కేవలం మామిడి మాత్రమే కాకుండా చీనీ, నిమ్మ, జామ, దోస, అరటి, బొప్పాయి వంటి పంటలు పండించే రైతులకు కూడా ధరల స్థిరీకరణ చేయాలి. గిట్టుబాటు ధరతోపాటు ఎరువులు, మందులపై తగిన రాయితీలు కల్పించాలి. మార్కెట్‌లో నాణ్యత లేని నారు, నకిలీ విత్తనాలు సరఫరా చేస్తూ రైతులను దగా చేస్తున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ల్యాబ్ ధృవీకరించిన మొక్కలనే రైతులకు అందుబాటులో ఉంచాలి.

**పాలకులారా మేల్కొనండి**

"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని పరుగులు పెట్టిస్తామని హామీ ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలోనే, లక్షలాది మంది ఆధారపడిన మామిడి రంగం ఇంతటి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుండటం ఆందోళనకరం. ప్రతి ఏటా కాయ బాగా కాస్తే ధర ఉండదు, ధర ఉంటే కాయ కాయదు అనే చందంగా మారిన రైతు బతుకుల్లో వెలుగులు నింపాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. శనివారం యాదమరి వేదికగా ముఖ్యమంత్రి ఈ ప్రాంత భూమి పుత్రుల కష్టాలను, ఏపీ రైతు సంఘం డిమాండ్లను సానుకూలంగా ఆలకించి, క్షేత్రస్థాయి పరిశీలన జరపాలి. మామిడి బోర్డు ఏర్పాటుపై, ఎగుమతి సుంకం రద్దుపై కేంద్రంతో మాట్లాడి స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించాలి. అప్పుడే రాయలసీమ నిజమైన ఉద్యానవన హబ్‌గా మారుతుంది, అన్నదాత సుఖీభవ అనే నినాదానికి సార్థకత చేకూరుతుంది."

# తిరుపతి ని అర్బన్ మోడల్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం..

- టిడిపి రాష్ట్ర నేత డాక్టర్ 'కోడూరు' చేపట్టిన ప్రయత్నాలకు ప్రభుత్వం సానుకూలం...
- నగర అభివృద్ధిపై మంత్రి లోకేష్, సీఎంఓ అధికారుల సానుకూలం..

**తిరుపతి – మే 22, (ఆంధ్రనాడు):** తిరుపతి ని ఆధ్యాత్మిక నగరంతో పాటు ఐటీ హబ్, మోడల్ అర్బన్ సిటీగా అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమని టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం చెప్పారు. గత మూడు రోజులుగా అమరావతిలో టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న, ఇతర అధికారులతో డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం పలుమార్లు కలసి తిరుపతి ని మోడల్ సిటీ తో పాటు ఐటీ హబ్‌గా తీర్చిదిద్దే విధంగా సుదీర్ఘంగా చర్చించారు. అందుకు మంత్రి నారా లోకేష్ తో పాటు సీఎంఓ అధికారులు కూడా సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న ను డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తో పాటు రాష్ట్ర నేతలు పుష్పావతి యాదవ్, కృష్ణ యాదవ్ కలిసి తిరుపతి నగరంలో ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, అభివృద్ధికి చెప్పడాల్సిన పనులపై సుదీర్ఘంగా ప్రద్యుమ్నతో డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం చర్చించారు.

**ప్రతిపాదించిన ప్రధాన అంశాలు ఇవే....**

తిరుపతిని స్పిరుచువల్ క్యాపిటల్, ఐటి ఇన్నోవేషన్ హబ్, క్లీనెస్ట్ పిలిగ్రిమ్ సిటీగా అభివృద్ధి చేయడం..

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజా రవాణా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడం...



నగరపాలక సంస్థ పరిధిలోని ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు, నియంత్రిత వెడ్డింగ్ జోన్ల ఏర్పాటు..

రోడ్డు పక్కన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఈట్ స్ట్రీట్ జోన్లను ఏర్పాటు చేయడం...

తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో 'ఫ్లెక్సీల ఫ్రీ తిరుపతి' అమలు ద్వారా నగర శుభ్రత క్రమశిక్షణ పెంపు...

ఈ– షటిల్ (ఎలక్ట్రిక్ మొబిలిటీ ) ప్రాజెక్టు ఏర్పాటు చేసి ఆధునిక రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం. వంటి కార్యక్రమాల అమలుకు కార్యాచరణ రూపొందించడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్నతో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. అందుకు వారు సానుకూలత వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం కు హామీ ఇచ్చారు.

## ఘనంగా "కిశోరీ వికాసం సమ్మర్ క్యాంప్"




**పలమనేరు, ఆంధ్రనాడు, మే 22 :** పలమనేరు రూరల్ మండలం దుగ్గినవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నాడు "కిశోరీ వికాసం సమ్మర్ క్యాంప్" కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ ఉమారాణి, సూపర్‌వైజర్ మాధవీలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోరీ బాలికలు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను, సమాజంలో విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలు టీవీ, స్మార్ట్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించుకోవాలని, చదువుపై మరియు శారీరక వికాసంపై దృష్టి పెట్టాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా నుండి ఈ కార్యక్రమానికి హాజరైన ప్రత్యేక అధికారులు వివిధ సామాజిక అంశాలపై సదస్సు నిర్వహించారు. ఏఎస్ఐ శ్యామల , వన్ స్టాప్ సెంటర్, మహిళల రక్షణ మరియు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శివశంకర్ (ప్రొటెక్షన్ ఆఫీసర్, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ కేర్, పోక్సో యాక్ట్, గృహహింస నిరోధక చట్టం లపై అవగాహన కల్పించారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం, ఆత్మరక్షణ , మరియు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం గురించి క్షుణ్ణంగా వివరించారు. దీనితో పాటు, భవిష్యత్తు అవసరాల కోసం చిన్నతనం నుంచే పొదుపు చేయడం, బ్యాంక్ ఖాతా కలిగి ఉండటం మరియు సేవింగ్స్ యొక్క ప్రాముఖ్యతను పిల్లలకు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎంఎస్‌కే రూప, పంచాయతీ సెక్రటరీ, వెలుగు సీసీ, అంగన్‌వాడీ టీచర్ వాణి, సంఘమిత్రలు మరియు అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ కు గురై వ్యక్తి దుర్మరణం



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 22 :** విద్యుత్ షాక్ కు గురై శివకుమార్ అనే వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం మండల కేంద్రమైన పెద్దపంజాణిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి. శివకుమార్ తన వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు వరిపైరు కోసే యంత్రానికి అడ్డుగా వుండడంతో పైకి లాగే ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో శివకుమార్ విద్యుత్ షాక్ కు గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే పెద్దపంజాణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే శివకుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేణిగుంటలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు




**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 22:** మండల కేంద్రమైన రేణిగుంటలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ ఏర్పాటు చేసి కట్ చేశారు. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన రహదారిలో మొక్కలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, నాయకులు డి. పుష్పనాథన్, నవాబ్, సుబ్రహ్మణ్యం, వంశీ యాదవ్, విద్యాసాగర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



**కార్వేటినగరం – ఆంధ్రనాడు, మే 22 :** ప్రభుత్వ పాఠశాలలోనే క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్, మనోజ్ కుమార్ లు తెలియజేశారు. కేఎంపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల లో పరిసర గ్రామాల ప్రజలు విద్యార్థులను చేర్పించాలని స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ పాఠశాల విద్యార్థులు 6 మంది ప్రభుత్వ పాఠశాలలో చేరడం ఎంతో ఆనందదాయకమని, డబ్బులు వృధా చేసుకోకుండా నాణ్యమైన విద్య ఉచితంగా లభిస్తున్నదని, ఐదు మంది ఉపాధ్యాయులతో కూడిన ఆదర్శ ప్రాథమిక పాఠశాల మన గ్రామంలో ఏర్పాటు చేశారని తల్లిదండ్రులందరూ గుర్తించి ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే చలపతిరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ సురేష్,ఓం ప్రకాష్ ఉపాధ్యాయులు తులసి, ప్రకాష్ ,జయసుధలు పాల్గొన్నారు.

# పలమనేరు అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలవనున్న మోడల్ మార్కెట్

- ఎమ్మెల్యే సమక్షంలో మార్కెట్ నిర్మాణానికి భూహద్దులను నిర్ణయించిన అధికారులు
- త్వరలో పనులు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 22:** పలమనేరు అభివృద్ధిలో ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ ఓ మైలురాయిగా నిలవనుందని స్థానిక శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని కేటీల్ ఫామ్ వద్ద 33 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ నిర్మాణానికి సంబంధించి శుక్రవారం కీలక ముందడుగు పడింది. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు మరియు రెవిన్యూ శాఖ సిబ్బంది కలిసి మార్కెట్ స్థలానికి హద్దులు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు అన్ని సౌకర్యాలు ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడమే ఈ ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధునిక వసతులతో నిర్మించబడనున్న ఈ మార్కెట్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలు మరింత సులభతరం కావడంతో పాటు రైతులకు మంచి ధరలు లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్ నిర్మాణానికి అవసరమైన భూహద్దుల నిర్ణయ ప్రక్రియ పూర్తి కావడంతో త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని, వెంటనే పనులు జరిగేలా చూడాలని అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించా రు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రాంతీయ ఆర్థి కాభివృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు ఉపాధి అవ కాశాలు కూడా పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డా రు. ప్రజలకు అవసరమైన అన్ని వాణ ిజ్య, నిల్వ మరియు మార్కెటింగ్ సౌకర్యాలను సమగ్రంగా కల్పించే ఈ ఇంటి గ్రేటెడ్ మోడల్ మార్కెట్ ఈ ప్రాంత అ భివృద్ధిలో కీలకం కానుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వెట ర్నరీ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శ్రీలత, డీ న్ ఆఫ్ డైరీ సైన్స్ డాక్టర్ నాగేశ్వర రావు, డిఈఈ ఉమా శంకర్, పలమనేరు ప్రాజెక్టు అధికారులు డాక్టర్ భారతి, డాక్టర్ అరుణ మరియు గంగవరం తహసిల్దార్ రేఖా, సర్వే అధికారి రమణారెడ్డి, మార్కెట్ క మిటీ చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ దిలీప్ కుమార్,ఏఎంసీ సెక్రటరీ సంజీవ్ కుమార్ మరియు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# యానాది కాలనీలో కిషోరి వికాసం కార్యక్రమం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 22 :** రేణిగుంట మండలం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వెధల చెరువు యానాది కాలనీ, తండ్లం అంగన్వాడీ కేంద్రం నందు కిశోరి వికాశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట ప్రాజెక్ట్ కృష్ణవేణి, సూపెర్వైసర్. హేమావతి, అనంత లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త గంగమ్మ, ప్రగతి సిబ్బంది సురేష్ మరియు కిశోరి బాలికల, తల్లులు పాల్గొన్నారు. సూపెర్వైజర్ హేమావతి మాట్లాడుతూ కిశోరి బాలికల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసవి సెలవుల్లో కిశోరి వికాసం కార్యక్రమం అమలు చేయడం జరిగింది అని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో పిల్లలకి విద్య యొక్క ప్రాముఖ్యత, పోక్సో చట్టశీ, ఆర్థిక సాధికారత, బాల్య వివాహం, పోషకాహారం, పరుశుభ్రత, జీవన నైపుణ్యాలు మొదలగు అంశాలపై దసలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేసారు. సెలవుల్లో ఈ అవకాశాన్ని పిల్లలు ఉపయోగించుకొని సమావేశాలకు హాజరై సమాచారాన్ని తెలుసుకొని గ్రామంలోని అందరి కిశోరి బాలబాలికలకు వివరించాలని తెలియజేసారు. ప్రతి మంగళవారం మరియు శుక్రవారం కూడా గ్రామ స్థాయిలో కిశోరి బాలబాలికలకు సమావేశం ఏర్పాటు చేసి ఒక్కో అంశం పైన వివరంగా శిక్షణ అందించడం జరుగుతుందని తెలియచేసి కిశోరి బాలికలతో ర్యాలీ, మానవహారం నిర్వహించడం జరిగింది.

# ఆదర్శవంతమైన అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం




**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 22 :** మండలంలో ఆదర్శవంతమైన అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని రామచంద్రాపురం ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి అన్నారు. రామచంద్రాపురం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎ వీ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అందరం కష్టపడి పనిచేసి,ప్రజలకు మెరుగైన సేవలందిద్దామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా, విద్యుత్ కోతలు చోటు చేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా వైద్యాధికారులు సూచనలు సలహాలు అందజేయాలన్నారు. ఫ్లెక్సీల ఏర్పాట్లపై అధికారులు, సభ్యుల మధ్య వాగ్వివాదం జరిగింది. పంచాయతీ అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని డిప్యూటీ ఎంపీడీవో (పంచాయతీరాజ్) శ్రీనివాసులు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి మార్కండేయ నాయుడు మాట్లాడుతూ అనుపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలలో తిరుపతి మారుతి నగర్ కు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది కొర్లగుంట రఘునాథ్ రెడ్డి తన తాత కొర్లగుంట పెద్ద చిన్నమ్మ రెడ్డి,తల్లిదండ్రులు కొర్లగుంట గంగిరెడ్డి, జయలక్ష్మమ్మల జ్ఞాపకార్థం ఆరు తరగతి గదులు, మౌలిక వసతులను కల్పించడానికి ముందుకు వచ్చారని వివరించారు. అలాంటి దాతలను అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై ఎంపీపీ ఏవి బ్రహ్మానంద రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వి ఢిల్లీ రాణి, ఎంపీడీవో పులిరాం సింగ్, డిప్యూటీ ఎంపీడీవో తేజోవతి, పశు వైద్యాధికారి జయ కుమార్, వైద్యాధికారి జావిద్, ట్రాన్స్కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు మనీల, రేవతి, ఏటీఎం గురుమూర్తి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత ప్రధాన ధ్యేయం




రేణిగుంట – ఆంధ్రనాడు, మే 22: మహిళల భద్రతే ప్రధాన ధ్యేయమని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మహిళల భద్రత, మహిళ సాధికారత, సైబర్ నేరాల నివారణ, అత్యవసర సహాయ సేవలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజులమండ్యం ఆర్.పి.ఆర్ కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు భద్రత, చట్టపరమైన రక్షణ, అత్యవసర సేవల వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత , ఎస్బీ డీఎస్పీ గీతా కుమారి, రేణిగుంట డీఎస్పీ చెంచు బాబు, సీఐలు, ఎస్సైలు, ఎంపీడీవోలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, పాల్గొని మాట్లాడుతూ సమాజ అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు మహిళ సాధికారతను పక్కన పెట్టి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేము. ఒక మహిళ బలపడటం అనేది కేవలం ఒక వ్యక్తి ఎదుగుదల కాని అది ఒక కుటుంబానికి భరోసా, ఒక గ్రామానికి దిశానిర్దేశం, ఒక రాష్ట్రానికి అభివృద్ధి సంకేతం. స్వయం సహాయక సంఘాలు మహిళల జీవితాల్లో ఆర్థిక స్థిరత్వంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించాయి. 'నేను చేయగలను అనే ఆత్మవిశ్వాసాన్ని మహిళల్లో పెంచాయి. మహిళ గౌరవంగా నిలబడిన చోట నేరాలకు స్థానం తగ్గుతుంది. పిల్లల భవిష్యత్తు బలపడుతుంది అందుకే మహిళ సాధికారత అనేది ఒక పథకం కాదు అది సమాజ పురోగతికి అత్యంత శక్తివంతమైన ఉద్యమం అని పేర్కొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలు అధికంగా ఉన్న ప్రాంతాలు, పరిశ్రమలు, కార్యాలయాలు, విద్యాసంస్థలను గుర్తించి నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డీజీపీ ఆదేశాల మేంకు ప్రతిరోజూ మహిళలను ఒకచోట సమీకరించి భద్రత, చట్టపరమైన హక్కులు, అత్యవసర సేవలపై చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. చిన్నారులపై పెరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు ఒకవైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే, మరోవైపు నేరస్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా స్కూల్స్, కాలేజీలు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సహకారంతో ప్రతి మహిళకు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై గ్రామస్థాయి నుంచే అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, యువత సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. చిన్న పిల్లలు, యువత ఎక్కువగా సెల్‌ఫోన్‌కు బానిసలవుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల వల్ల అవసరాలను పక్కనపెట్టి అనవసర విషయాలపై ఆసక్తి పెరుగుతోంది. ఈ పరిస్థితి మారాలి అని హెచ్చరించారు. ప్రతి పౌరుడు ఒక పోలీసుగా మారాలి. సమాజంలో జరిగే తప్పులను చూసి మౌనంగా ఉండకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అవగాహన కలిగిన యువత సమాజంలో ఎలా ముందుకు వెళ్లాలి, ఎలా నడుచుకోవాలి, ఎలా బాధ్యతగా జీవించాలి అనే విషయాలను తెలుసుకొని ఇతరులకు కూడా ఆదర్శంగా నిలవాలి అని ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులపై వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గ హెచ్చరించారు. మొదటి తప్పుకే రౌడీషీట్ నమోదు చేస్తాం. అదే తరహా నేరాలను మళ్లీ చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళలు, పిల్లల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా 'శక్తి' యాప్ వినియోగం, సోషల్ మీడియా భద్రత, సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, చైన్ స్నాచింగ్, మహిళల అక్రమ రవాణా, గృహ హింస, వర్క్ ప్లేస్ హరాస్‌మెంట్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 22:** రేణిగుంట బస్టాండ్ కూడలిలో ఆటో డ్రైవర్లకు శుక్రవారం సాయంత్రం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైన్ స్నాచింగ్ ,సైబర్ నేరగాళ్లు , గంజాయి యువకులపై పోలీసులన్నిగా పెరిగిందని అన్నారు. ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించి నేరగాళ్లను పట్టించాలని కోరారు .ప్రధానంగా మహిళల భద్రత ప్రధాన ధ్యేయంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ జయచంద్ర ,సబ్ ఇన్స్పెక్టర్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుమారుడి అద్భుతం...

### - రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ప్రణీత్ ఎంపిక...



**కేవీబీపురం–ఆంధ్రనాడు, మే 22:** తిరుపతిలోని ఎస్వీయూ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి శాప్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. అండర్–16, అండర్–20 విభాగాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60 మంది బాలబాలికలు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో కేవీబీపురం మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఎన్. ప్రణీత్ అద్భుత ప్రదర్శన కనబరిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. అండర్–16 విభాగంలో తన ప్రతిభతో మెప్పించిన ప్రణీత్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించాడు. ప్రణీత్ తల్లిదండ్రులు అశోక్ -- కావేరి దంపతులు కుటుంబ పోషణ కోసం అశోక్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ తన కుమారుడి అభిరుచికి, క్రీడా ప్రతిభకు అండగా నిలుస్తున్నారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ప్రణీత్ తన కృషి, పట్టుదలతో రాష్ట్రస్థాయికి చేరుకోవడం గ్రామంలో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు ప్రణీత్‌ను అభినందించారు.

## తంబళ్లపల్లి మండల కురబ సంఘం అధ్యక్షులుగా సుధాకర్

### -నూతన అధ్యక్షుడిని శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించిన టీడీపీ నేతలు



**తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, మే 22:** తంబళ్లపల్లి మండలం కురబ సంఘం అధ్యక్షుడిగా తంబళ్లపల్లికి చెందిన జి. సుధాకర్ ఎన్నికయ్యారు. శనివారం కురబలకోట మండలం ముదివేడు క్రాస్ లో రాష్ట్ర కురబ సంఘం నేతలు కాంతారావు, లక్ష్మన్న,రెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కురబ కులస్థులంతా కలసి తంబళ్లపల్లి మండలా ధ్యక్షుడిగా సుధాకర్, ఉపాధ్యక్షుడిగా దండువారిపల్లెకు చెందిన శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సుధాకర్ ను టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామచంద్ర,గుండ్లపల్లి యూనిట్ ఇంచార్జి కాలా నారాయణ, టీడీపీ జిల్లా కార్యదర్శి కశెట్టి వెంకటరమణ, తెలుగు యువత నాయకులు నరసింహులు, సుగవాసి శివకుమార్,మధు నాయుడు,మాజీ మల్లయ్యకొండ చైర్మన్ గంగుల్ రెడ్డి,చాంద్ బాషా, శ్రీనివాసులు,వీర భద్ర, ఇసుల కిట్ట దుస్సాలువ, పూలమా లలతో ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ మండలం లో కురబ కులస్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తూ వారి అభివృద్ధికి పాటు పడతానన్నారు.

## రేణిగుంటలో రైల్వే పెన్షన్ల సదస్సు

**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 22:** రేణిగుంట పట్టణంలో శుక్రవారం ఏఐఆర్ఆర్ఎఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే పెన్షన్ల సదస్సు నిర్వహించారు ముఖ్య అతిథిగా జాతీయ అసోసియేషన్ నాయకుడు శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వవేతన సంఘానికి ఏఐఆర్ఎఫ్ సిఫార్సులపై పలు అంశాలపై వివరణ ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. కనీస పెన్షన్, స్థిర వైద్య ఖర్చులకు గాను 3000 రూపాయలు పెంచామని ఇలా ఎన్నో సమస్యలపై జాతీయస్థాయిలో చర్చించడం జరిగిందన్నారు. రైల్వే పెన్షన్ల సమస్యలు పరిష్కరించడానికి ఏఐఆర్ఎఫ్ నుండి పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. జోనల్ వైస్ ఛైర్మన్, రేణిగుంట అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎం .విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎనిమిదవ కేంద్ర వేతన సంఘం నాకు చేసిన సిఫారసులపై ఆయన పూర్తి విశ్వాసాన్ని తెలిపారు. జాతీయ నాయకుడు శ్రీధర్ రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకుడు శ్రీధర్‌తో పాటు తెలంగాణ సేవా సమితి అధ్యక్షురాలు గీత, రాజేంద్రప్రసాద్ తదితరులను సత్కరించారు. అసోసియేషన్ నాయకులు కృష్ణ దాస్ వైస్ ఛైర్మన్లు రాజు, మజీద్, రెడ్డి, కార్యదర్శులు రామ్మూర్తి, జబ్బర్, మోహన్, రాఘవరెడ్డి పెన్షనర్లు పాల్గొన్నారు.







# తప్పులు లేని ఓటర్ల జాబితాకు సహకరించాలి

### - ఎన్నికల నిర్వాహణ అధికారి మాధవ్ కృష్ణా రెడ్డి



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 22:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎన్నికల నిర్వహణ అధికారి, హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధవ్ కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్,పోలింగ్ స్టేషన్ల యుక్తీ కరణ,పెండింగ్ దరఖాస్తుల త్వరితగతిన పరిష్కారం, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు,తప్పుల సవరణ వంటి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 15వ తేదీ నుంచి జూలై 14వరకూ బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్ళి ఓటర్ల సర్వే చేపడతారన్నారు. మృతి చెందిన ఓటర్లు, నూతన ఓటరు నమోదు,మార్పులు, చేర్పుల కోసం జూలై 21నుంచి ఆగస్టు 21వరకూ క్లైంలు స్వీకరిస్తారన్నారు. ఏదైనా అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఆగస్టు 21నుంచి సెప్టెంబర్ 18వరకూ క్లైమ్ లను పరిశీలించి 22న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. అలాగే 1200ఓటర్లు పైన ఉంటే అదనంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా భాగస్వాములు కావాలని ఇందుకోసం ప్రతి పోలింగ్ స్టేషన్ కు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమిం చుకోవాలని సూచించారు. ఆయా బూత్ ల వారి రాజకీయ పార్టీల ఏజెంట్లు బీఎల్ఓలకు సహకరించి తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర నాయక్, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, నాయకులు పురుషోత్తం, వీరాంజనేయులు,నరసింహులు, క్లస్టర్ ఇంచార్జి బేరి శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ రామచంద్ర, జనసేన నియోజకవర్గ నాయకులు ఎంఎన్. చంద్రశేఖర్ రెడ్డి, మండల నాయకులు సిద్దమల్ రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, నియోజకవర్గం నాయకులు గోపాల్ రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య,యుగంధర్ రెడ్డి, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా పథకాలపై అధికారులకు దిశానిర్దేశం

### - పీఏఎల్, టీచ్ టూల్‌పై ఓరియంటేషన్
### - డొక్కా సీతమ్మ విద్యా పథకాలపై అధికారులకు దిశానిర్దేశం



**తిరుపతి రూరల్ – ఆంధ్రనాడు, మే 22:** జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన డిప్యూటీ విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్, అవగాహన శిక్షణ కార్యక్రమం తిరుపతి రూరల్ మండలంలోని చిగురు వాడ అకార్డ్ విద్యా సంస్థలో విజయవంతంగా జరిగింది. వ్యక్తిగత అనుకూల అభ్యాస విధానం (పీఏఎల్), డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, టీచ్ టూల్ అమలు, పర్యవేక్షణ విధానాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శామ్యూల్ మాట్లాడుతూ., విద్యా ప్రమా ణాల పెంపులో సాంకేతిక ఆధారిత విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. పీఏఎల్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస అవసరాలను గుర్తించి, వారి అభ్యాస నైపుణ్యాలను మెరుగుపరిచే అవకాశం ఉందన్నారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యత, పారదర్శకత, పరిశుభ్రత అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ ద్వారా ప్రభుత్వ విద్యా కార్యక్రమాలు మరింత ఫలితాలను సాధిస్తాయని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల హాజరు, ఆరోగ్య పరిస్థితుల మెరుగుదలకు దోహదపడుతోందన్నారు. ప్రతి మండల, డిప్యూటీ విద్యాశాఖ అధికారి తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయ అధికారి భరత్ కుమార్ మాట్లాడుతూ, టీచ్ టూల్, పీఏఎల్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా అధికారులకు పర్యవేక్షణ, మానిటరింగ్ విధానాలపై స్పష్టమైన అవగాహన కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏఎల్ ల్యాబ్స్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎ. సుధాకర్, ఏఎంఓ చంద్రశేఖర్ నాయుడు, సీఎంఓ సురేష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రైతులకు సబ్సిడీ పశు గ్రాస విత్తనాలు పంపిణీ



**తంబళ్లపల్లి–ఆంధ్రనాడు, మే 22:** గడ్డి కొరతను నివారించేందుకు ప్రభుత్వం 75శాతం సబ్సిడీతో పశు గ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు మండల పశు వైద్యాధికారి విక్రం రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్ఎన్ తండా పంచాయతీ బోనాసివారిపల్లెలో పాడి రైతులకు సబ్సిడీ మొక్కజొన్న, జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలానికి 15టన్నుల మొక్కజొన్న,జొన్నలు వచ్చాయన్నారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు,భూమి పాసు పుస్తకం జిరాక్స్‌లతో పాసు వైద్యశాలలో సంప్రదించి తీసుకోవచ్చన్నారు. అలాగే సబ్సిడీపై పశువుల దాణా కూడా పాడి రైతులకు అందజేస్తామన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పాడి పశువుల కొనుగోలుకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తోందన్నారు. అలాగే వీబీ–జీరాం–జీ పథకంలో పచ్చి గడ్డి సాగు పథకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. పాడి రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, సిబ్బంది బాబ్జాన్ నాయక్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికె" కిషోరి వికాసం"



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 22:** బాలికలలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికె కూటమి ప్రభుత్వం కిషోరి వికాసం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పిచ్చాటూరు సిడిపిఓ సౌభాగ్యమ్మ ఆదేశాలతో శుక్రవారం నాగలాపురం పట్టణంలోని వినోభా నగర్ అంగన్వాడీ కేంద్రంలో కిషోర్ వికాసంపై కౌమార బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని, ఇందులో భాగంగానే మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు కిషోరి వికాసంపై ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆయా అంగన్వాడి కేంద్రాల్లో కౌమార బాలికలకు అవగాహన కార్యక్రమాలు జరుగుతుందన్నారు. కౌమార దశలో బాలికలు రక్తహీనతకు గురి కాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దీనివల్ల ఆరోగ్యం కూడా కాపాడుకోవాలని, ప్రస్తుతం మహిళపై లైంగిక దాడులు వేధింపులు అధికమవుతున్న నేపథ్యంలో మానసిక స్థైర్యంతో ముందుకు వెళ్లాలని, ఇందుకోసం బాలికలు ఉన్నత చదువులు చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన ఏర్పడుతుందని, చదువుతోపాటు నైపుణ్య అభివృద్ధి పెంచుకోవాలన్నారు. ప్రధానంగా బాలికల సగటు వివాహ వయస్సును పెంచడం, లింగ సమానత్వం తీసుకురావడంతో పాటు వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశం అన్నారు. అనంతరం ఆరోగ్యం, పోషకహారం, ఋతుపారిశుభ్రత, పోస్కో యాక్ట్, బాల్యవివాహాలు, డ్రగ్స్, స్కిల్స్, సైబర్ నేరాలు తదితర అంశాలపై సూపర్వైజర్ శ్రీదేవి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త, సహాయకురాలు, కిషోరి బాలబాలికలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నాణ్యతతో సాగాలి

**- జూన్ 15 నుంచి బీఎల్ఓల ఇంటింటి సర్వే ప్రారంభం**
**- ఎస్ఐఆర్ పై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 22 :** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నాణ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డీఆర్ఓ నరసింహులతో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల జాబితాల సవరణ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి వివరాలను సక్రమంగా సేకరించాలని సూచించారు. బీఎల్ఓలకు ఈఆర్ఓల ఆధ్వర్యంలో జూన్ 5 నుంచి 14 వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బీఎల్ఓలు జూన్ 15 నుంచి జూలై 15 వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేసి జాబితాను ప్రధాన ఎన్నికల అధికారికి పంపనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 21న విడుదల చేయనున్నట్లు తెలిపారు. జూలై 21 నుంచి ఆగస్టు 8 వరకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని, వాటి పరిష్కారానికి సెప్టెంబర్ 18 వరకు గడువు ఉంటుందని వెల్లడించారు. తుది ఓటర్ల జాబితాను ఆగస్టు 22న ప్రచురించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

# అభివృద్ధిపై కలెక్టర్‌తో సూళ్లూరుపేట ఎమ్మెల్యే భేటీ



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 22:** సూళ్లూరుపేట నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన అంశాలపై సూళ్లూరు పేట ఎమ్మెల్యే డా. నెలవెల విజయశ్రీ, తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ను శుక్రవారం కలిసి చర్చించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పెండింగ్ పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనులపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అందిస్తామని తెలిపారు.

# గుంతలు పూడ్చివేత




**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 22:** సత్యవేడు మండలం అలివేలు మంగాపురం ( ఏ.ఎం.పురం) బస్టాప్ వద్ద ఏర్పడిన పలు గుంతలను స్థానిక టిడిపి నాయకులు పూడ్చి వేశారు. వి.ఆర్.కండ్రిగ నుంచి టి.పి.కోట ప్రధాన రోడ్డు మార్గం పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా మారింది. ఈనేపథ్యంలో ఏ.యం.పురం బస్టాప్ వద్ద బావులను తలపించే గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు గ్రామంలోకి వేళాలన్న, ప్రయాణికులు బస్సు ఎక్కడానికి ఇక్కడ వేచి ఉండాలన్న ఇబ్బందులు తప్పని స్థితి ఏర్పడింది. ఈ మార్గంలో కొత్త రోడ్డు నిర్మాణానికి ప్రజా ప్రతినిధి భూమి పూజ చేసి రెండు నెలలు పూర్తిగా వస్తున్న రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏ.ఎం.పురం టిడిపి నాయకులు గోపిరెడ్డి, కోటి తదితరులు వారి సొంత ప్రోక్లైన్ వాహనంతో శుక్రవారం బస్టాప్ వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చి చదును చేయడంతో వాహనదారులకు ప్రయాణికులకు కొంతవరకు ఇబ్బందులు తప్పింది.

# రూ.1.57 కోట్లతో 68 జల సంరక్షణ పనులు

**- నీటి సంరక్షణ పనులతో మండలంలోని 3612 ఎకరాలకు సాగునీటి లబ్ధి.**



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 22:** నాగలాపురం మండలం వెంబాకం, కొట్టాకాడు నాగలాపురం, రాజులకండ్రిగ, సదాశివ శంకరాపురం పంచాయితీ రైతులకు సాగునీటి ప్రయోజనం కోసం జల దార జల హారతి క్రింద గ్రామ పంచాయతీ ఉపాధి హామీలో జరుగుతున్న పంట కాలువ పనులను శుక్రవారం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐజెపీహా, మద్దిలేటి, ఎంపీడీవో శ్రీతేజశ్వని, ఉపాధి సిబ్బందితో కలసి సందర్శించి ఉపాధి శ్రామికులకు ప్రతి రోజు వేతనము రూ 307/- కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

# ప్రజల ప్రాణాలతో విద్యుత్ అధికారుల చెలగాటం

**- ప్రజల పట్ల ఇంతటి నిర్లక్ష్యం ఎందుకు....**
**- అసలు విధ్యుత్ అధికారులు ఏం చేస్తున్నారు....**
**- ప్రాణానష్టం జరిగాక అధికారులు స్పందిస్తారా...**



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 22:** నాగలాపురం మండలంలో పలు గ్రామాలలో విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫర్లు మనిషి చేతికి అందే విధంగా క్రిందే ఉన్నాయి. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత విద్యుత్ శాఖ సీఎండి ఆదేశాల మేరకు వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారం కరెంటోళ్ళ జనబాట కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ఈ కార్యక్రమం నాగలాపురం మండలంలో జరుగుతుందో? లేదో? అర్థం కావడం లేదు అంటున్న ప్రజలు. ఎందుకంటే ఏ గ్రామంలో వెళ్లిన ప్రజలు చెప్పే మొదటి మాట మా ఇంటి పైన విద్యుత్ లైను వెళ్తున్నదని, విద్యుత్ లైన్లు కిందకు వేలాడుతూ ఉన్నాయని, ఇంటి ముందర విద్యుత్ స్తంభాలు పక్కకు వాలి ఉన్నాయని ఇవే కాక పలు సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కానీ సొంత గ్రామాలలో నివసించే కొంతమంది అసిస్టెంట్ లైన్ మాన్ లు విధులు నిర్వహించే సమయంలో విధులు నిర్వహించకుండానే విధులు నిర్వహించే విధంగా ఉన్నతాధికారుల దృష్టిలో వ్యవహరిస్తున్నారు. ఇదంతా జరుగుతున్న మండల విద్యుత్ శాఖ అధికారులకు తెలియదా లేదా తెలిసి తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారా లేదా మనకెందుకులే మన పని చూసుకోని వెళ్దామని వ్యవహరిస్తున్నారా అర్థం కావడం లేదు అంటున్న ప్రజలు. ఇప్పటికైనా నాగలాపురం ఉప విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా విద్యుత్ శాఖ అధికారులు గ్రామాలపై పర్యటించి గ్రామాలలో విద్యుత్ శాఖ అధికారులు చేస్తున్న నిర్లక్ష్యాన్ని కళ్లారా చూసి అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# తిరుచానూరు -దామినేడు రహదారిపై కీలక ఆదేశాలు

**- డ్రైనేజీ సమస్యపై తక్షణ చర్యలకు ఆదేశం**
**- ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టర్ దృష్టి**
**- వారంలోపు డ్రైనేజీ సమస్యల పరిష్కార ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు ఆదేశం**

**తిరుపతి కలెక్టరేట్ –ఆంధ్రనాడు, మే 22:** తిరుచానూరు ఫ్లైఓవర్ నుంచి దామినేడు వరకు జరుగుతున్న జాతీయ రహదారి–71 విస్తరణ పనుల్లో భాగంగా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఈ రహదారి విస్తరణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి రూరల్ మండలం సి. మల్లవరం క్రాస్ నుంచి దామినేడు హౌసింగ్ కాలనీ వరకు ఉన్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. పేరూరు సప్లై ఛానల్ నిర్మాణం, రామానుజపల్లి పరిసర ప్రాంతాల్లోని కాలనీల డ్రైనేజీ సమస్యలు, అలాగే తిరుచానూరు ఫ్లైఓవర్ నుంచి దామినేడు హౌసింగ్ కాలనీ వరకు ఉన్న నీటి పారుదల సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ రహదారి వెంబడి నివసిస్తున్న ప్రజలు దీర్ఘకాలంగా డ్రైనేజీ సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారి విస్తరణ పనులతో పాటు శాశ్వత పరిష్కార దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి వారంలోపు సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, జిల్లా పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట దీర్ఘకాలిక పరిష్కారానికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, తుడా ఎస్ఈ రవీంద్ర, కార్పొరేషన్ ఎస్ఈ శ్యాంసుందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే బొజ్జల జన్మదిన వేడుకలు



**శ్రీకాళహస్తి – ఆంధ్రనాడు, మే 22 :** శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు పెద్ద ఎత్తున కేక్ లు కటింగ్ చేసి స్వీట్లు పంచి పెట్టారు . అలాగే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ భవన్ లో కేక్ కట్ చేశారు . గాలిగోపురం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఏరియా ఆసుపత్రి రోగులకు పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అన్నా క్యాంటీన్లో పేదలకు టోకెన్లు ఇచ్చారు . సుబ్రమణ్యస్వామికి పూజలు చేశారు. గిరిపుత్రుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు . విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, మునిరాజా నాయుడు, దశరథాచారి , డాక్టర్ ఎం.ఉమేష్ రావు, కాసరం రమేష్, సుబ్బయ్య, బుజ్జి, పేటా బాలాజీ రెడ్డి, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో యుపిఎస్సి పరీక్షా ఏర్పాట్లు పూర్తి

**- 10 పరీక్షా కేంద్రాల్లో 5,096 మంది అభ్యర్థులు**
**- కలెక్టర్ సమీక్ష.. కఠిన నిబంధనలు అమలు**




**తిరుపతి కలెక్టరేట్ –ఆంధ్రనాడు, మే 22:** ఈ నెల 24న జరగనున్న యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష--2026ను ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షా నిర్వహణపై అసిస్టెంట్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లు, లైజన్ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5,096 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పేపర్--1 ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, పేపర్--2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని వివరించారు. పరీక్ష ప్రారంభానికి అర్ధగంట ముందు వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా హాళ్లలోకి అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, వైర్లెస్ హెడ్‌సెట్స్ వంటి వాటికి పూర్తిగా నిషేధం విధించనున్నట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్ వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే పరీక్షా సమయాల్లో జామర్లు వినియోగించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలని, లేకపోతే పరీక్షా కేంద్రంలో ప్రవేశం ఇవ్వబడదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, యుపిఎస్సి పరిశీలకుడు జితేందర్ శర్మ, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యా దోపిడీని అరికట్టాలి



**శ్రీకాళహస్తి – ఆంధ్రనాడు, మే 22 :** ముందస్తు అడ్మిషన్ల పేరుతో కార్పొరేట్ స్కూళ్లలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు డిమాండ్ చేశారు . స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద అక్రమ ఫీజు వసూళ్ళపై శుక్రవారం నిరసన తెలిపారు. రీఛార్జ్ పద్ధతిలో ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు . శ్రీకాళహస్తి పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ తల్లిదండ్రులను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ప్రభుత్వం వెంటనే తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. శివ, చైతు, చరణ్, సంతోష్, బోస్ తదితరులు పాల్గొన్నారు .

# ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆగాలి




**శ్రీకాళహస్తి – ఆంధ్రనాడు, మే 22 :** ఆర్టీసీ సంస్థను ప్రైవేటీకరించాలన్న ఆలోచనను కోటపై ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ కూడలి వద్ద నిరసన తెలిపారు. చంద్రబాబు చెప్పేది ఒకటి, చేసేది ఒకటి అని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతామంటూ హామీ ఇచ్చి.. నేడు తెగనమ్మేందుకు పూనుకుంటున్నాడని విమర్శించారు. చంద్రబాబు వైఖరి మానకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కత్తి రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733